మాజీ మంత్రి హరీశ్‌రావుకు పరామర్శ

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు నాలుగు రోజుల కింద పోలీసుల తోపులాటలో చేతిభుజానికి గాయం కావడంతో ఆయన దవాఖానలో చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్వీ కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్ మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆదివారం హరీశ్ రావు నివాసంలో కలిసి పరామర్శించారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

డాక్టర్ కిషన్‌రావు సేవలు చిరస్మరణీయం

కిషన్‌రావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 : ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ అల్లాణి కిషన్‌రావు సేవలు చిరస్మరణీయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో దివంగత కిషన్‌రావు సంస్మరణ సభలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. పటాన్‌చెరు కాలుష్యంపై ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. గృహకాలుష్యానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ అని కిషన్‌రావుకి నివాళిగా పటాన్‌చెరులో కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పటాన్‌చెరులో ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

నాటి పోరాటానికి జాతీయ స్థాయి గుర్తింపు

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కిషన్‌రావు సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన 1980 దశకంలో కాలుష్యానికి వ్యతిరేకంగా నిర్మించిన ప్రజాఉద్యమం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. జాతీయ మీడియాతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా పటాన్‌చెరు కాలుష్యం గుర్తించారన్నారు. తెలంగాణ ప్రాంత సహ సద్భావ ప్రముఖ్ రామకృష్ణ, పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ శిల్పకృష్ణ, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ రవి, ఆర్ భిక్షపతి, యాకూబ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు కొల్కురి నర్సింహారెడ్డి, మోహన్‌గౌడ్, శేషాద్రి, న్యాయవాది శివప్రసాద్, శ్రీనివాస్‌గుప్తా, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫలించిన 'మిషన్'

- మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం
- నీటితో కళ కళ లాడుతున్న హద్నూర్ పెద్ద చెరువు
- మిషన్ కాకతీయలో రూ. 81 లక్షతో మరమ్మతులు
- చెరువు పరిధిలోని గ్రామాల్లో పెరిగిన భూగర్భ జలాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

నీటితో కళ కళ లాడుతున్న హద్నూర్ పెద్ద చెరువు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 15 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ సత్ఫలితాలను ఇస్తున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత చిన్న, పెద్ద నీటి వనరులను పునరుద్ధరించడానికి మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల మరమ్మతులు చేపట్టింది. మండలంలోని హద్నూర్ పెద్ద చెరువును రూ. 81లక్షలతో పునరుద్ధరించారు. దీంతో చెరువు సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భజాలలు పెరిగాయి. అప్పట్లో చెరువులను ఆధునీకరించి పూర్వవైభవం తీసుకొస్తానని, రైతుల కళ్లలో ఆనందం నింపుతామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన మాటలు నేడు అక్షర సత్యమయ్యాయి. ఇందుకు నిదర్శనమే మండలంలోని హద్నూర్ పెద్ద చెరువు చెప్పుకోవచ్చు. 50 ఏండ్ల కింద గ్రామ శివారులో 130 ఎకరాల్లో పెద్ద చెరువును నిర్మించారు. అప్పట్లో ఈ చెరువు కింద కుడి, ఎడవ కాల్వ కింద వందలాది ఎకరాలకు సాగుకు నీరు అందించారు. కొంత కాలంగా కాల్వల ద్వారా సాగుకు సక్రమంగా నీరు అందింది. కాల్వలకు ఏర్పడిన లీకేజీలతో సాగుకు నీరు అందలేక వృథాగా పోయింది. ఈ విషయాన్ని సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా.. కాల్వలకు మాత్రం మరమ్మతులు చేపట్టలేకపోయారు. ఫలితంగా చెరువు ద్వారా సాగుకు నీరు అందకపోవడంతో రైతులు పంటలను పండించుకోలేకపోయారు. అప్పట్లో స్థానిక గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చెరువును పర్కులేషన్ ట్యాంకుగా మార్చాలని కోరారు. దీంతో చెరువును పర్కులేషన్ ట్యాంకుగా మార్చారు. చెరువులో నీరు నిలవడం వల్ల భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు లభించడంతో రైతులు పంటలు బాగా పండించుకున్నారు. తాగునీటి కొరత లేకుండా పోయింది. గతంలో ఎవరు ఈ చెరువు బాగోగులను పట్టించుకోలేదు. చెరువులో పూడిక మట్టి పేరుకుపోయిన పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల చెరువులో పూర్తి స్థాయిలో నీరు నిండడం లేదు. దీంతో చెరువు పరిధిలోని బోర్లు, బావు ల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సాగు, తాగుకు నీటి కొరత ఏర్పడుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకం కింద చెరువు పునరుద్ధరణ పనులను చేపట్టారు. దీంతో చెరువులో ఏన్నో ఏండ్లుగా పేరుకుపోయిన పూడిక, పచ్చి మొక్కలు తొలిగింపు, చెరువు కట్ట పటిష్టత, అలుగు లీకేజీ తదితర పనులను చేపట్టడంతో బాగుపడింది. గత రెండు, మూడు సంవత్సరాలతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులోకి భారీగా వరద చేరింది. దీంతో చెరువులో చేరిన నీటితో కళకళలాడుతుంది. చెరువులో చేరిన వరద నీటితో భూగర్భజాలలు పెరుగుతున్నాయి. మిషన్ కాకతీయ పనులతో చెరువులోతు పెరిగి నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో మండలంలోని హద్నూర్, గుంజోట్టి, రాంతీర్థం, వడ్డి, హుసేల్లి, అత్నూర్, రుక్మాపూర్, న్యాల్‌కల్ తదితర గ్రామాల రైతులకు ఎంతగానో దోహదపడింది. ఆయా గ్రామాల పరిధిలోని బోరు, బావుల్లో భూగర్భజలాలు పెరగడంతో సాగు, తాగుకు నీటి ఇబ్బందులు తొలిగిపోతాయని ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అలుగు పారుతున్న దృశ్యం

భూగర్భ జలాలు పెరిగాయి..

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ద్వారా హద్నూర్ చెరువు పూర్వవైభవం సంతరించుకున్నది. ఈ పథకం కింద చెరువులో పూడికతీత, పచ్చి మొక్కలు తొలిగిం పు, కట్ట, అలుగుకు మరమ్మతులు చేపట్టడంతో వేసవి కాలంలోనూ చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటున్నది. పునరుద్ధరణతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. గతంలో వర్షాలకు చెరువులో చేరిన నీరు చెరువు కట్టలు, అలుగు, తూములు సక్రమంగా లేకపోవడంతో వచ్చిన నీరు వృథాగా పోయేది. కానీ.. మిషన్ కాకతీయ ద్వారా చెరువులో చేరిన వరద నీటితో కళకళలాడుతున్నది. చెరువు కింద ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు పెరగడంతో సాగు, తాగునీటి కొరత లేదు.

-ఎంఆర్. ప్రవీణ్‌కుమార్,
పీఎసీఎస్ డైరెక్టర్, రైతు, హద్నూర్

అదృశ్యమైన వ్యక్తి..శవమై

రాజు (ఫైల్)

సిర్గాపూర్, సెప్టెంబర్ 15 : మండలంలోని చిన్న ముబార్‌పూర్‌లో విషాదం నెలకొంది. సిర్గాపూర్ పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజు(35) ఈ నెల 9న అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈనెల 10 మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం మండలంలోని బొక్కస్‌గాం శివారులో ఓ వ్యక్తి చింత చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానిక రైతుల చూసి తప్పిపోయిన రాజుగా గుర్తిం చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొ ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని 'ఖేడ్' ప్రభుత్వ దవాఖానకు తరలించామని ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం

న్యాల్‌కల్, సెప్టెంబర్ 15 : మండలంలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులోని నారింజ వాగు ప్రాజెక్టు సమీపంలోని బీదర్-జహీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల్లో ఒకరి మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని హద్నూర్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ జహీరాబాద్ వైపు నుంచి బీదర్ వైపు వెళ్తున్నది. మండలంలోని నారింజవాగు ప్రాజెక్టు సమీపంలోని రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతల నుంచి బస్సును తప్పించే క్రమంలో బీదర్ వైపు నుంచి వస్తున్న బైక్‌ను బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవఖానకు తరలించారు. క్షతగాత్రులు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హస్టూర్ గ్రామానికి చెందిన రోహన్ (17), సాయికుమార్ (18), సిద్దార్థ(19)గా గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. చికిత్సపొందుతున్న సాయికుమార్ మృతిచెందగా, సిద్దార్థ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడటంతో హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామానాయుడు పేర్కొన్నారు.

పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలి

సంగారెడ్డి, సెప్టెంబర్15 : తాము డప్పులు కొట్టం ఉద్యోగాలు చేస్తున్నాం.. కుల వృత్తి మానేస్తాం అంటే దళితులను సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కేవీపీఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాణిక్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉన్న మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజి గౌడలో దళిత యువకులు చంద్రం, అర్జున్ డప్పులు కొట్టం అన్నందుకు గ్రామ పెత్తందార్లు సామాజిక బహిష్కరణ చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు శివకుమార్, సహాయ కార్యదర్శులు మహేశ్,ప్రవీణ్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

జిన్నారం, సెప్టెంబర్ 15 : మండల కేంద్రం జిన్నారంలో నీటి సమస్య నెలకొన్నది. గ్రామంలోని రెండు, మూడు, నాలుగు, ఐదో వార్డులో నాలుగు రోజులుగా నీళ్లు సరఫరా కావడం లేదని గ్రామస్తులు, చిట్కుల వెంకటేశ్ తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సిర్గాపూర్, సెప్టెంబర్15 : మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈమేరకు సంబంధిత డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. మండలంలో మొత్తం రూ.4.05 కోట్లు అభివృద్ధి పనులు జరిగాయి. దీంట్లో రూ. 3.92 కోట్లు కూలీల వేతనాల చెల్లింపులు, మెటీరియల్ కాంపోనెంట్ రూ.7.41లక్షలు నిధులు వెచ్చించారు. వీటిపై క్షేత్రస్థాయిలో ఒక ఎస్ఆర్‌పీ, 13 మంది డీఆర్పీలు పర్యటించి సామాజిక తనిఖీ చేపడుతున్నారని ఏపీవో బస్వరాజ్ తెలిపారు.

కాల్వలో పూడిక తీత

కల్హేర్, సెప్టెంబర్ 15 : వానకాలంలో సాగు చేసిన వరి పొలాలకు సాగు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు పూడికతీత చేపట్టారు. కల్హేర మండలం మార్డి గ్రామ శివారులోని నల్లవాగు ప్రాజెక్టు కాల్వ కింద రైతులు వరి పంటను సాగు చేశారు. కాల్వలో పూడిక పెరుకుపోవడంతో నీరు పొలాలకు పారడం లేదు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేకపోవడంతో పంటలు ఎండి పోయే ప్రమా దం ఉందన్నారు. రైతులందరూ కలిసి ఫత్తేపూర్ చౌరస్తా నుంచి పెద్ద చెరువు వరకు కాల్వ పూడిక తీసేందుకు చర్యలు చేపట్టారు.

నారాయణఖేడ్ : నిమజ్జనం సందర్భంగా బజరంగ్‌దళ్ గణేశుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సంగారెడ్డి : కుంకుమార్చనతో గణపతికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మునిపల్లి : బుసారెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు,పూజలు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 15 : అమీన్‌పూర్ మున్సిపల్ మండల పరిధిలోని వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఎ మ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి వైస్ చైర్మన్ నరసింహగౌడ్ కౌన్సిలర్లు బాసెట్టి కృష్ణ కల్పన ఉపేందర్ రెడ్డి శశిధర్ రెడ్డి ఎంపీపీ దేవానంద్ తులసి రెడ్డి రమేశ్ గౌడ్ భాస్కర్ రెడ్డి లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గణేష్ పూజలో ముస్లిం కుటుంబం బీరంగూడ కృష్ణానగర్ కాలనీలో గణేశ్ మండపం వద్ద గ్రానైట్ వ్యాపారి అబ్దుల్లా కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు.

కోహీర్‌లో..

కోహీర్, సెప్టెంబర్ 15 : మండలంలోని దిగ్వాల్ గ్రామ మహంకాళి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయకుడిని ఆదివారం నిమజ్జనం చేశారు. కోలాట, భజనకీర్తనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గణేశుడి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నారింజ నీటిలో నిమజ్జనం చేశారు. కోహీర్ పట్టణంలోని సార్వజనిక వినాయక మండలి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, అన్నప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గణేశ్‌రెడ్డి, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, సెప్టెంబర్15 : తెల్లాపూర్‌లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీస్‌లో ప్రతిష్టించిన గణనాథుల నిమజ్జనోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారి లడ్డుని నిర్వాహకులు వేలం వేశారు. తెల్లాపూర్‌లోని ఉర్జిత్ విల్లాలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డుని వేలం వేయగా, విశ్వేశ్వర్‌రావు కుటుంబం రూ.12.5 లక్షలకు స్వామివారి లడ్డుని సొంతం చేసుకున్నారు. మైహోమ్ అంకురాలో వినాయకుడి లడ్డూని వేలం వేయగా నల్లప రెడ్డి గణేశ్‌రెడ్డి కుటుంబం రూ.6.55 లక్షలకు సొంతం చేసుకున్నారు. బ్లూఫీల్డ్‌లో వినాయకుడి లడ్డూని వేలం వేయగా తిక్కవరపు నందకిశోర్ రూ.1,00,116కి సొంతం చేసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, టీనా అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.05 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

నారాయణఖేడ్, సెప్టెంబర్ 15 : నారాయణఖేడ్ పట్టణంలోని బజరంగ్‌దళ్ గణేశ్ లడ్డూ వేలంపాటలో రూ.2.05 లక్షల ధర పలికింది. స్థానిక హోటల్ వ్యాపారి మోహన్ వేలం పాటలో దక్కించుకున్నారు. ఇదే గణేశ్ వద్ద మరో లడ్డూను పట్టణానికి చెందిన అశోక్ యాదవ్ రూ.1.16 లక్షలకు దక్కించుకున్నారు.

కోహీర్ : దిగ్వాల్‌లో వినాయకుడిని కోలాటాలతో నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

అమీన్‌పూర్ : బీరంగుడా కృష్ణ నగర్ లో పూజలు నిర్వహిస్తున్న అబ్దుల్లా కుటుంబం

అందోల్ : జోగిపేటలో గణపతికి పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం : తెల్లాపూర్ ఉర్జిత్ విల్లాలో రూ.12.5లక్షలకు సొంతం చేసుకున్న లడ్డుతో విశ్వేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు

రామచంద్రాపురం : తెల్లాపూర్ మైహోమ్ అంకురాలో రూ.6.55 లక్షలకు సొంతం చేసుకున్న గణేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నిమజ్జనానికి అంతా సిద్ధం

చెరువును సందర్శించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

సంగారెడ్డి, సెప్టెంబర్15 : వినాయక నవరాత్రులు ముగించుకుని నిమజ్జానానికి సిద్ధమయ్యాయి. ఆదివారం మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై మధ్యాహ్నం ఏర్పాటు చేస్తున్న పనులను ఎస్పీ చెన్నూరి రూపేశ్ సందర్శించారు. మంగళవారం జరుగనున్న వినాయకుల నిమజ్జనానికి తరలివచ్చే గణపతులు, విగ్రహాల వెంట వచ్చే భక్తుల సౌకర్యానికి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ నుంచి రూ.30 లక్షలను కేటాయించినట్లు అధికారుల సమాచారం. ఈ నిధులతో పట్టణంలోని అన్ని కాలనీల నుంచి గణపతుల ఊరేగింపున విద్యుత్ కాంతులు వెదజల్లే విధంగా లైటింగ్ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ప్రతి రోడ్డులో గుంతలు లేకుండా మరమ్మతులు చేశారు. అలాగే చెరువు కట్టపై గణుషుల నిమజ్జనం చేసేందుకు భారీ క్రెన్‌లు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు గజీతగాళ్లను సిద్ధం చేశారు. నిమజ్జన సమయంలో చెరువు నీటిలో భక్తులకు అవకాశం లేదని ఎస్పీ సూచించారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన వారిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్పీ సత్తయ్యగౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చహాన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఇంతియాజ్ అహ్మద్, అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చెరువు కట్టపై ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ చెన్నూరి రూపేశ్

గుంతలమయంగా అన్నారం రోడ్డు

గుమ్మడిదల : గుంతలుగా మారిన అన్నారం-జంగంపేటకు వెళ్లే రోడ్డు

గుమ్మడిదల, సెప్టెంబర్ 15 : గుంతలమయంగా అన్నారం రోడ్డు మారడంతో ప్రయాణికులకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్నారం నుంచి జంగంపేట వరకు వెళ్లేరోడ్డు పూర్తిగా భారీ గుంతలుగా మారడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు మీదుగా భారీ వాహనాలు, మట్టి టిప్పర్లు పోవడం వల్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులతో వేసిన రోడ్డు కొన్ని నెలలకే ఇలా మారిపోవడం సరికాదని స్థానికులు వాపోతున్నారు. అన్నారం - జంగంపేట రోడ్డు మీదుగా హైదరాబాద్ రోడ్డుకు లింక్ రోడ్డు కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్ర యాణిస్తాయి. దీంతో ఈ రోడ్డు గుంతలుగా మారడం నాసిరకం పనుల వల్లె గుంతలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

గుంతల రోడ్డు .. ప్రయాణం ఎట్లా ?

మునిపల్లి : బుసారెడ్డిపల్లి గ్రామ శివారులో గుంతల మయమైన రోడ్డు

మునిపల్లి, సెప్టెంబర్ 15 : గీరోడ్డును జెర్ర బాగు చెయ్యండి సార్.. పడుతూ లేస్తూ ప్రయాణం చేస్తున్నాం. బుధేరా నుంచి సింగూరు ప్రాజెక్టు వెళ్లే రోడ్డుపై స్థానికులు, పర్యాటకులు వాపోతున్నారు. చెరువును తలపిస్తున్న ఈ రోడ్డుపై ప్రయాణం చెయ్యాలంటే నరకం చూస్తున్నామని, ఆటుగా వెళ్లే వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి బుధేరా-సింగూర్ రోడ్డుకు మరమ్మతులు చేసి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

అందోల్, సెప్టెబంర్ 15 : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం అందోల్‌లో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్‌కు చెందిన వెండికోల్ నర్సింహులు, భార్య నిర్మల(35)తో కలిసి హైదరాబాద్‌లో గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం నిర్మల గుండెపోటుతో మృతి చెందిందని మృతురాలి తల్లితండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి, నర్సింహులు సొంత గ్రామం అందోల్‌కు మృతదేహాన్ని తీసుకువచ్చాడు. అంత్యక్రియలకు ఏర్పాటు చేయగా మృతిపై అనుమానం వచ్చిన బంధువులు భర్తను నిలదీశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు రంగప్రవేశం చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మృతురాలి భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్సై పాండు తెలిపారు.

చెరువులో పడి బాలుడు మృతి

దుబ్బాక, సెప్టెంబర్15: చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం దుబ్బాక మండలం అప్పనపల్లిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొమురవెల్లి మండలం గౌరాయిపల్లికి చెందిన బండి నవీన మూడు రోజుల కిందట తన పిల్లలతో కలిసి తల్లిగారింటికి దుబ్బాక మండలం అప్పనపల్లికి వచ్చింది. ఆదివారం ఉదయం నవీన తన తల్లి రేణుక, మరదలు కావ్యతో పాటు ఆమె కొడుకు సాయిని వెంట తీసుకుని గ్రామంలోని ఊర చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో నవీన తన కొడుకు సాయికి స్నానం చేయించింది. ఆనంతరం సాయిని చెరువు కట్టపై ఆడుకోవాలని చెప్పి నవీన తన తల్లి, మరదలుతో కలిసి బట్టలు పిండుతున్నారు. ఈ క్రమంలో సాయి (7) ఆడుకుంటూ చెరువులోకి దిగడంతో నీట మునిగాడు. ఇది చూసిన నవీనతో పాటు వారి బంధువులు చెరువులో దిగి సాయి కోసం గాలించారు. కొంత సమయంలోనే సాయి మృతదేహం వెలికితీశారు. నవీన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని దుబ్బాక సర్కారు దవాఖానకు తరలించారు.